తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
సోమవారం
22 సెప్టెంబర్ 2025
పేజీలు : 08
Follow :



# ఒక్కేసి పువ్వేసి చందమామ

- ఆడి పాడిన మహిళలు
- తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు
- వైభవంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం

**వరంగల్ బ్యూరో ,సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** తీరక్క పువ్వులను అందంగా పేర్చి మధ్యలో గౌరమ్మ నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రతి ఏటా నిర్వహిస్తున్న బతుకమ్మ పండుగ వేడుకలు ఈసారి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. బతుకమ్మ బతుకమ్మ మాకు బంగారు బతుకులు ఇవ్వమ్మా అంటూ మహిళలు ఆడుతూ పాడుతూ అమ్మవారిని వేడుకోవడం కనిపించింది. ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాము ఆయ చందమామ అంటూ లయబద్ధంగా మహిళలు వాడుకోవడం కనిపించింది రామ రామ ఉయ్యాలో రాముని శ్రీ రామ ఉయ్యాలో అంటూ ఉయ్యాల పాటలు పాడుతూ ఎంతో ఆనందంగా మహిళలు తమ బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం ఎంతో సందడి చేసింది వరంగల్ నగరంలోని రంగసాయిపేట ఉరుసు కరిమాబాదు కిలా వరంగల్ శ్రీ భద్రకాళి దేవాలయ ప్రాంతం శివనగర్ కాశిబుగ్గ కిలా వరంగల్ గిర్మాజిపేట మట్టవాడ రంగంపేట హనుమకొండ శ్రీ వైష్ స్తంభాల దేవాలయ ప్రాంతము కాజీపేట బాలసముద్రం మొదలైన ప్రాంతాల్లోని దేవాలయాల ప్రాంగణాల వద్ద మహిళలు బతుకమ్మలతో వచ్చి తమ భక్తి పాటలతో భజనలతో కోలాటాలతో అలరించారు. తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగ విశిష్టతను మరోసారి తెలియజేశారు మిగతా 8లో..

# భూసంస్కరణల చరిత్రలో అధ్యాయంగా నిలిచిన చాకలి ఐలమ్మ

- నాటక రూపంలో ఐలమ్మ చరిత్ర తీసుకురావడం సాహసమే
- నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- కాళోజీ కళాక్షేత్రంలో కాకతీయ నృత్య నాటకోత్సవాలు
- హాజరైన పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో హన్మకొండ లోని కాళోజీ కళా క్షేత్రం లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కాకతీయ నృత్య నాటకోత్సవాలను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉమ్మడి ,వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రి దనసరి అనసూయ సితక్క, రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా ఈ నాటకోత్సవాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సిపి సన్ ప్రీత్ సింగ్, జిడబ్ల్యుఎంసి కమీషనర్ చాహత్ వాజ్ పాయి, సంగీత నాటక అకాడమీ చైర్పర్సన్ ఆచార్య ఆలేఖ్య పుంజాల, ప్రజాప్రతినిధులు, అధికారులు కవులు, కళాకారులు, కళాభిమానులు తదితరులు పాల్గోన్నారు. ఈ సందర్భంగా సంగీత నాటక అకాడమీ చైర్పర్సన్ ఆచార్య ఆలేఖ్య పుంజాల బృందంచే ప్రదర్శించిన మిగతా 8లో..

# ఐలవ్ మహమ్మద్ ప్రవక్త పోస్టులు నేరమా?

- భావ ప్రకటన స్వేచ్ఛ కోసం శాంతియుత నిరసన




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** : ఐలవ్ మహమ్మద్ ప్రవక్త అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు కేసులు పెట్టడంపై ఆగ్రహిస్తు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిశ్శబ్ద నిరసన భగ్గుమంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ సీనియర్ నేత ఖిజార్ పాషా, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, జర్నలిస్ట్ ఫిరోజ్ ఖాన్, జావా ఎన్జీఓ నాయకుడు షమ ఆధ్వర్యంలో ఆదివారం నిరసనకారులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు తమ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త మహమ్మద్ పట్ల ప్రేమను వ్యక్తం చేయడం నేరమా అని ఈ కేసులు రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి అని నిరసనకారులు మండిపడ్డారు. వ్యక్తిగత విశ్వాసాలను ఇలా అణగదొక్కడం ప్రజల్లో భయాందోళనలు, అపనమ్మకాలు రేకెత్తిస్తుందని హెచ్చరించారు. నిరసనలో పలువురు నాయకులు సంఘీభావం ప్రకటించారు.

## భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ రూరల్,సెప్టెంబర్21(జనం సాక్షి) :** జిల్లాలో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.అవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని,వాగులు, వంకలు,నదులు పొంగిపొర్లే పరిస్థితుల్లో వాటిని దాటే ప్రయత్నం చేయరాదని కలెక్టర్ సూచించారు. తక్కువ ఎత్తులోని ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్థానిక తహసీల్దార్,ఎంఆర్ఓ, ఎంపీడీఓలకు సమాచారం ఇవ్వాలని,జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 9100577132 ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఇప్పటికే జిల్లా యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని అప్రమత్తంగా ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చు

- జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడవచ్చు అని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక కళ్యాణ మండపంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో సొసైటీ జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ....రక్తదానం చేయడం ద్వారా గర్భిణులకు ప్రసవ సమయంలో, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి అత్యవసర పరిస్థితులలో, సికిల్ సెల్ తల సేమియా వ్యాధిగ్రస్తుల ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని, శరీరంలో నూతన రక్తం మిగతా 8లో..

## అట్టహాసంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు




**పర్వతగిరి సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని విస్డం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయినీలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక ఐన బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేయడం కోసం, పువ్వులను పూజిస్తూ ప్రకృతితో మమేకమై జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రతి సంవత్సరం పాఠశాలలో విద్యార్థులతో జరుపుకుంటామని, తెలంగాణ సాంస్కృతిక సంపద బతుకమ్మ పండుగ అని పాఠశాల ప్రిన్సిపాల్ అనుమాండ్ల దేవేందర్ అన్నారు. పాఠశాల విద్యార్థులు చేసిన రావణాసురుని ప్రతిమ, రావణ దహనం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాస్, సుధాకర్ ఉపాధ్యాయులు యాకయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్పందించిన మానవతా మూర్తులు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి):** పేదోని ఆపదకు అండగా నిలుద్దాం అని కోవిడ్ వాలంటీర్స్ నెన్నెల సమన్వయ కర్త భీంపుత్ర శ్రీనివాస్ జలంపల్లి పిలుపునివ్వడంతో మానవతా వాదులు స్పందించారు. నెన్నెల మండలం గంగారాం గ్రామానికి చెందిన నిరుపేద లింగంపల్లి అంకయ్య గుండె, కిడ్నీ సమస్యతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బాధితుని పేద కుటుంబం ఆర్థికసాయం కోసం అర్థించడంతో కోవిడ్ వాలంటీర్స్ నెన్నెల సమన్వయ కర్త ఆదుకోవాలని పిలుపునివ్వగా విరాళాలు 13,500 రూపాయలు జమ అయ్యాయి. ఆదివారం బాధిత కుటుంబానికి నగదు అందజేసి, త్వరగా కోలుకోవాలని కోరారు. అంకయ్య కోలుకోవాలని సాయం అందించే వారు తోడ్పాటు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో జాడి రాజ్ కుమార్, షాకీర్ పాషా, శ్రీరాముల దేవేందర్, గుమస ఏసు పాల్గొన్నారు.

## మంచిర్యాల ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి):** బెల్లంపల్లి పట్టణంలో ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు 65వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పండ్లు పంచి పెట్టారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ మహ్మద్ గౌస్ భాయ్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ తొంగల మల్లేష్, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్ రాజు, మాజీ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, మాజీ కోఅప్షన్ సభ్యుడు సలీమ్, నాయకులు అచ్చే శివాజీ వర్మ, జంగం దాక్టర్, ఇమ్రాన్, మీర్జా మహబూబ్ బేగ్, పెద్ది శ్రీనివాస్, దుర్గం కమల, షేక్ సాదిక్, అబ్బాస్, సాబీర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రాలకు బస్సుల కొరత : ఆర్టీసీ ప్రయాణికుల అవస్థలు

- పండుగల వేళ ఇబ్బందులు పడుతున్న ప్రజలు




**నర్సంపేట. సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** శ్రీశైలం, యాదాద్రి , భద్రాచలం, పుణ్యక్షేత్రాలకు నర్సంపేట డిపో నుండి తీర్థయాత్రలకు వెళ్లే ప్రయాణికులకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో పలు పుణ్యక్షేత్రాలకు వెళ్లాల్సిన భక్తులు పాప సోపాలు పడుతూ శ్రీ ప్రతి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ డీలక్స్ , సూపర్ లగ్జరీ బస్సులు నర్సంపేట ఆర్టీసీ నుండి శ్రీశైలం , యాదాద్రి కి వెళ్ళేవి.పాకాల కొత్తగూడ నుండి భద్రాచలం కు బస్సు వెళ్లేది. ప్రస్తుతం నర్సంపేట డిపో బస్సులు ఈ రూట్లో వెళ్లడం లేదని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు.శ్రీశైలం పోవాలంటే హైదరాబాదుకి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి కి వెళ్లాలంటే హనుమకొండ నుండి వెళ్లవలసి వస్తుందంటున్నారు.భద్రాచలం కి అతి తక్కువ దూరంలో పాకాల కొత్తగూడ నుండి గతంలో బస్సు నడిచేదని ఇప్పుడు తీర్థయాత్రలకు వెళ్లాల్సిన బస్సులు చుట్టూ తిరిగి వెళ్ళవలసి రావడంతో సమీపంలో ఆర్టీసీ డిపో ఉన్న అవసరం తీరడం లేదని ఆర్టీసీ అధికారుల తీరుపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. కొత్తగూడెం మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాలలో నుండి నర్సంపేటకు వచ్చిన ప్రజలు తీర్థ యాత్రలకు వెళ్లేవారు పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారు ఈ దసరా పండుగ సందర్భంగా ప్రజల అవసరానికి అనుగుణంగా వాహనాలు లేకపోవడంతో ఆర్టీసీ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్, నర్సంపేట డిపో మేనేజర్, అధికారులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, చొరవ తీసుకొని. గతంలో పుణ్యక్షేత్రాలకు వెళ్లిన బస్సులను పునరుద్ధరణ చేయాలని కోరారు. ప్రయాణికుల అవసరానికి పుణ్యక్షేత్రాలకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# పండుగకు ఊరు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

- స్టేషన్ ఘన్పూర్ సీఐ జి వేణు

**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** దసరా పండగ సందర్భంగా ఇంటికి తాళాలు వేసి ఊర్లకు వెళ్ళేవారు లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్టేషన్ ఘన్పూర్ సీఐ జి వేణు తెలిపారు. పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వేణు మాట్లాడుతూ పండుగకు ఊరు వెళ్లేవారు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ,పరిమిత వేగంలో ప్రయాణించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని,రాత్రి పూట డ్రైవింగ్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పండగ సమయంలో దొంగతనాలు,ఆస్తినేరాల పట్ల అప్రమత్తంగా ఉండా లని, దసరా పండగ సెలవుల దృష్ట్యా స్కూల్స్, కళాశా లలకు సెలవులు రావడం తో చాలా వరకు సొంత గ్రామాలకు కానీ, ఇతరప్రాంతాలకు గాని ప్రయాణాలు చేస్తూం టారని, ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని, ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండి, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రయా ణాలలో హెల్మెట్, సీట్ బెల్ట్ దరించి, పరిమిత వేగంలో వెళ్లాలని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటి స్తూ, జాగ్రతగా వాహనాలను నడుపుతూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్ల లో భద్రపరుచుకోవడం క్షేమమని, ఊర్లకు వెళ్తున్నప్పుడు పక్కింటి వారిని ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలని, విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తి గత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదని, నగదు, బంగారు ఆభరణాలు ఉంటే ఇంట్లో పెట్టి వెళ్ళ కూడదనిఅన్నారు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలని, రోడ్లపై నిలుపరాద ని, ఊళ్ళకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, ఇంటి బయట ఒక లైటు వేసి ఉంచాలని ,ఆరుబయట వాహనాల కు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలని, ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం,సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని తెలిపారు. సిసి కెమెరాలను ఇంటర్నెట్ కు అనుసంధానం చేస్తే మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకు నే వీలుంటుందని, ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పా టుకు సహకరించాలని, తమ ప్రాంతం పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నెంబర్,ఇతర అధికారుల నెంబర్ లు ప్రజలు తమ సెల్ ఫోన్ లలో ఉంచుకోవాల ని అన్నారు. అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ కు గాని సంబంధిత పోలీస్ అధికారులకుగాని సమాచారం ఇవ్వాలని, సుదూర ప్రాంతాల ప్రయాణాలకు వెళుతున్నట్లైతే, పోలీసు స్టేషన్ లో మీ ఫోన్ నంబర్స్ ఇచ్చి వెళ్లాలని, తద్వారా ఎలాంటి విపత్కర పరిస్థితులలో నైనా గుర్తిం చడానికి వీలుగా ఉంటుందని అన్నారు.ఈ సమావేశంలో ఎస్ఐలు వినయ్ కుమార్,రమేష్,రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## తాడిచర్లలో ఉచిత మెగా వైద్య శిబిరం

**మల్హర్, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** చంద్రుపట్ల అనసూయమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో మంథని రెనే హాస్పిటల్, రుద్ర సత్యంబాబు పిల్లల హాస్పిటల్ గోదావరిఖని సహకారం తో మండల కేంద్రమైన తాడిచెర్ల లోని జెడ్పీహెచ్ఎస్ ఓల్డ్ హైస్కూల్ లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి పిల్లల వైద్య నిపుణులు దాక్టర్ సత్యం బాబు, జనరల్ ఫిజీషియన్ వైద్యులు లక్ష్మి నారాయణ ఈ ఉచిత వైద్య శిబిరంలో తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల చుట్టూ పక్క గ్రామల నుండి వచ్చిన సుమారు 500 మందికి ప్రస్తుత సీజనల్ వ్యాధులతో పాటు బిపి, షుగర్ ఈసీజి వంటి పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు చంద్రుపట్ల సునీల్ రెడ్డి కి పలు వురు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల మాజీ సర్పంచ్ మల్కా మోహన్ రావు, ట్రస్ట్ డైరెక్టర్ బండ శ్రీకాంత్ పటేల్, సభ్యులు సమ్మయ్య, షేక్ నిషాన్ పాష,లింగన్న పేట అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రాళ్ళబండి ప్రశాంత్, విజయ్ కుమార్, రాయమల్లు, చేరాలు, వేముల శేషు పాల్గొన్నారు.



## ఢిల్లీలో ఏబీవీపీ గెలుపు పై సంబరాలు



**చిట్యాల సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ముష్కే అజయ్ ఆధ్వర్యంలో ఢిల్లీ లో విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం గెలుపొందడంతో టపాసులు పేల్చి ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్ఞానం, శీలం, ఏకత ఢిల్లీ గడ్డపై అత్యధిక మెజార్టీతో గెలుపొందడం జరిగిందని తెలిపారు. జాతీయవాదం వైపు నడుస్తూ విద్యార్థుల పక్షాన ఎల్లప్పుడు ఏబీవీపీ నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు సాయి చరణ్, కౌశిక్, శశివర్ధన్, కృష్ణ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా పండుగకి ఊరికెళ్తున్నారా.. జర ఇల్లు భద్రం

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనం సాక్షి)** దసరా సెలవులకు వెళ్లే ప్రజలు జాగ్రత్తగా వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలను అప్రమత్తం చేశారు. దసరా సెలవులను పురస్కరించుకొని తమ స్వగ్రామాలు, విహార యాత్రలకు తరలి వెళ్తుండడంతో ఇండ్లల్లో చోరీలను నియంత్రణ చేసేందుకు పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. అలాగే చోరీల కట్టడికై ప్రజలు సైతం తమ వంతు భాధ్యత పోలీసులు తెలిపిన ఈ క్రింది సూచనలను పాటించాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రీత్ సింగ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్లు ఏర్పాటు చేసుకోండం మంచిది. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో లేదా మీగ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వండి. వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలే తప్ప, పక్కింటి వారికి తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దు. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిది. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్/ సెక్యూరిటీ గార్డ్/ సర్వెంట్ గా నియమించుకోవాలి. సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండి మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలి. ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్ లో మీ ఇంటిని, పరిసరాలను లైవ్/ ప్రత్యేక్షంగా చూసుకొవచ్చు. సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కట్టెన్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నది. మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేయండి. ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అవుతుందని సీపీ తెలిపారు.

# జెడ్పిహెచ్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



**పర్వతగిరి సెప్టెంబరు 20:(జనం సాక్షి)**మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో తల్లి దండ్రుల సమావేశం మరియు స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి గాయపలింగారెడ్డి హాజరై స్ఫూర్తి కార్యక్రమం వల్ల విద్యార్థులలో ఎంతో మార్పు వచ్చిందని విద్యార్థులు స్ఫూర్తివంతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ఎదగాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బతుకమ్మ దసరా సెలవులు తల్లిదండ్రులు తన పిల్లలతో గడపాలని వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలని కోరారు సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ మూడు నెలల పంటపై రైతులు చూపే శ్రద్ధ లాగే పిల్లల నూరేళ్ల పంటపై శ్రద్ధ వహించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులను కోరారు పేరెంటు యాకూబ్ భాష మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 40 మంది తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**కాటారం, సెప్టెంబర్ 21: (జనం సాక్షి ):** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు, పద్మశాలి ముద్దుబిడ్డ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి వేడుకలు ఆదివారం నాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గారేపల్లి కూడలి లో గల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నిలువెత్తు పూలమాలలతో అలంకరణలు చేసి, అంగరంగ వైభవంగా నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాటారం మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దోమల సమ్మయ్య మాట్లాడుతూ పద్మశాలి ముద్దుబిడ్డ, తెలంగాణ జాతిపితగా ఖ్యాతికెక్కిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను కొనియాడారు. ఈనెల 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, గారేపల్లిలో జరిగే కార్యక్రమానికి పద్మశాలీయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు పులి అశోక్, కొండ వెంకటేశ్వర్లు, మాచర్ల రాజేందర్, వలస వెంకటేశ్వర్లు, గాదె రమేష్, దాసరి గట్టయ్య, పల్నాటి బలరాం, అమృతం సంతోష్, దోమల రాజశేఖర్, కనుకుట్ల శ్రీనివాస్, దోమల సురేష్, ఎలుగం రాజనారాయణ, కనుకుట్ల శ్రీను, ఎలుగం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలలో కొప్పూరు గ్రామం

## పరిశుభ్రత కోసం తహతహలాడుతున్న ప్రజలు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21(జనం సాక్షి):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొప్పూరు గ్రామం ప్రస్తుతం అనేక సమస్యలతో అల్లాడుతోంది. ముఖ్యంగా పరిశుభ్రత లోపం ప్రజలకు తలనొప్పిగా మారింది. గ్రామంలోని వాటర్ ట్యాంక్ చుట్టూ గడ్డి పెరిగి, నీళ్లు నిల్వ ఉండటం వల్ల దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగింది. రోజూ వందలాది మంది మహిళలు, వృద్ధులు ఇక్కడి నుంచే తాగునీరు తీసుకెళ్తున్నా, చెత్త పేరుకుపోవడం పందులు, కుక్కలు తిరగడం వల్ల ఆ ప్రదేశం పూర్తిగా అస్వచ్ఛంగా మారింది. నీళ్లు తెచ్చుకోవాలంటేనే భయం వేస్తోంది అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం మరో పెద్ద సమస్య రోడ్లపై చెత్త పేరుకుపోయి, దోమల బెడద రోజురోజుకీ పెరుగుతోందని వారు చెబుతున్నారు. అలాగే వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రిళ్లు రహదారులపై నడవడం ప్రమాదకరంగా మారిందని, పైగా కుక్క ల భయంతో పిల్లలు, మహిళలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్ లేకపోవడం పంచాయతీ కార్యదర్శి పట్టించుకోక పోవడం వల్ల మా సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియడం లేదు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎప్పుడు వస్తాదదో, ఎప్పుడు పోతాదో మాకు తెలియదు మా విన్న పాలు వినే వారు లేర? అని గ్రామ ఎవరికి చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. అధికారులు నాయకులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నా కొప్పూరు గ్రామంలో మాత్రం పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉందని వారు ఆరోపించారు. గ్రామ సమస్యలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలి అని పై అధికారులను గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు




**నస్పూర్(జనంసాక్షి):** శ్రీరాంపూర్ లోని ప్రగతి స్టేడియంలో ఈ నెల 23వ తేదీన తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనా చారి ఆదివారం రోజున నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న సాయంత్రం తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ సంబరాలలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొంటారని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సంపత్ గౌడ్, వెంకట్, రత్నాకర్ రెడ్డి, కందుల ప్రశాంత్, రాజశేఖర్, ఐతే ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

**భూపాలపల్లి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రి, అమృత వర్షిని వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేస్తూ రోగుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమృత వర్షిణి వృద్ధాశ్రమంలో వృద్ధు లకు పండ్లు పంపిణీ చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. తెలంగాణ తొలి దశ ఉద్యమకరుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన నాయకుడు, తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి ఘనుడు ని కొనియాడారు. నిత్యం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడుతూ చివరి శ్వాస వరకు ప్రజల అభివృద్ధి తన అభివృద్ధిగా భావించే అత్యంత అరుదైన వ్యక్తుల్లో ఒకడు. ప్రభుత్వం కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు నిర్వహించడం చాలా ఆనంద దాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జీ ఎస్సార్



చిట్యాల సెప్టెంబర్ 21 (జనంసాక్షి) మండలంలోని వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించి తమ సంతాపం తెలిపారు. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన జాలిగపు కొమురయ్య కుటుంబం, అందుకు తండాలో దాసారపు రాజయ్య కుటుం బం, నైన్ పాక గ్రామంలో వావిళ్ళ రాములు ,మండ రాజక్క, బిక్కనూరి లచ్చక్క కుటుంబం, అలాగే మండల కేంద్రంలోని పెరుమండ్ల కృష్ణ కుటుంబాలను పరామర్శించి, తమ సంతాపం తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, బుర్ర దబ్బెట అనిల్ కుమార్, బుర్ర లక్ష్మణ్ గౌడ్, గంగాధర్ రవీందర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు నేటి తరం యువత కృషిచేయాలని పట్టణ పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. బాపూజీ 13 వర్ధంతి సందర్భంగా స్థానిక రాజీవ్ చౌక్ లో ఆయన చిత్రపటానికి ఆదివారం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంతటి మహనీయుడి జీవిత చరిత్ర నేటి తరం విద్యార్థులకు తెలిసే విధంగా పాఠ్యపుస్తకాలలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు ఇంకెప్పుడు మంజూరు చేస్తారు

• ఎంసిపిఐయూ సూటి ప్రశ్న



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి):** బెల్లంపల్లి పట్టణంలో ఇందిరమ్మ ఇండ్లను ఇంకెప్పుడు మంజూరు చేస్తారని ఎంసిపిఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఎంసిపిఐయూ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి బెల్లంపల్లి పట్టణాన్ని విస్మరించడం శోచనీయమని అన్నారు. బెల్లంపల్లి పట్టణంలో ప్రజా పాలన పేరుతో ఎంతో ప్రతిష్టాత్మకంగా దరఖాస్తులు స్వీకరించి, పట్టణ ప్రజలకు ఆశ చూపారే తప్ప ఇంతవరకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయలేదన్నారు. పట్టణంలో ఎంతోమంది నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం కండ్లలో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారని, వెంటనే ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి పట్టణంలో వున్న నిరుపేదలందరికి పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరేపల్లి సతీష్, తోగరి రాహులు పాల్గొన్నారు.

## అమ్మఒడి ఆధ్వర్యంలో అన్నదానం



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి):** బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ఆదివారం అమ్మఒడి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా అమ్మఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు అజ్మీరా మోహన్, మంచిర్యాల జిల్లా బ్రాంచ్ మేనేజర్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో ప్రతి ఆదివారం అన్నదానం నిర్విరామంగా కొనసాగించాలనే సదుద్దేశంతో 05/04/2020 రోజున ప్రారంభించామని, బెల్లంపల్లి పట్టణంలో అన్నమో రామచంద్ర అని అలమటించే ఎందరికో ఆకలి తీరుస్తూ బెల్లంపల్లి పట్టణంలో 349వ వారాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నేటి కార్యక్రమం హనుమండ్ల రామయ్య – గంగమ్మ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల పూర్తి సహకారంతో అన్నదాన కార్యక్రమము నిర్వహించామన్నారు. యాచకులకు, నిరుపేదలకు, కూలీలకు, బాటసారులకు, సుమారు 200 మందికి అన్నదానం చేశామన్నారు. ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దాత హనుమండ్ల బుచ్చయ్య, అమ్మఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, అమూల్య, గన్నెవరం తిరుమల చారి, సిద్ధమల్ల రఘు, యండి యుసుఫ్, చెందుపట్ల లింగమూర్తి పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలో ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేశారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన మెండె స్వప్నకు 23500 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా అందజేశారు. ఈకార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ కమిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మినవేణి రాజేష్, నాయకులు సత్తయ్య, రేషవేణి రవి, నికాడి అంజన్న తదితరులు పాల్గొన్నారు.



## ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



**గణపురం, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గణపురం మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ భూపాల్ పల్లి జిల్లా నాయకులు బొల్లి బాబు ప్రేమలత గార్ల కుమార్తె బొల్లి భవ్య శ్రీ కి ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా గణపురం మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతోసత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ దూడపాక శంకర్, మాజీ సర్పంచ్ కట్ల శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆరు ముళ్ళ ఎల్ల స్వామి ,కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు దూడపాక దుర్గయ్య, ఆలూరి మొగిలి, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుకపెల్లి రమేష్ ,ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు దూడపాక శ్రీనివాస్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు దూడపాక పున్నం తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన ఎలుకటి అరుణ్‌కు ఆర్థిక సహాయం చేసిన జక్కుల కుమార్



**టేకుమట్ల సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ కుమారుడు ఎలుకటి అరుణ్ ఎంబిబిఎస్ లో సీటు సాదించిన సందర్బంగా టేకుమట్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జక్కుల కుమారస్వామి విద్యార్ధి అరుణ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి 10000/- ఆర్థిక సహాయం అందజేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశిరెడ్డిపల్లి గ్రామం నుండి ఎంబీబీఎస్ సీటు సాధించడం గొప్ప విషయం అని, విద్యార్థి అరుణ్ చదువులో రాణించి, భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నిలిగొండ శ్రీనివాస్, ఉడుత రవి, ఎలుకటి సమ్మయ్య, మెరుగు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పరకాల పట్టణ కేంద్రంలోని అంగడి మైదానం, దామెర చెరువు వద్ద జరగనున్న బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మహిళలు, కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొ నబోతున్నందున,తాగునీరు,శానిటేషన్, లైటింగ్ వ్యవస్థ,భద్రత,వంటి సదుపాయాలను సమగ్రంగా ఏర్పాటు చేయాలి అని ఆదేశించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగకు ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా జరిగేందుకు ప్రతి ఒక్క శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**బోథ్, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** గౌడ సంఘాల నాయకుల అరెస్టు ప్రజాస్వామ్యం మోకు దెబ్బ మండల అధ్యక్షుడు అతికం బాబగౌడ్ అన్నారు. .ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల నిజామాబాద్ జిల్లా ఏరుగట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తులపై వీడిసి సభ్యులు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల జేఏసీ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడను నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయన నివాసంలో అర్ధరాత్రి పోలీసుల అరెస్టు చేయడం సిగ్గుచేటని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. గౌడ సమాజానికి ప్రభుత్వం అండగా నిలవాల్సిందని గౌడ కులస్తులను బెదిరిస్తూ పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం మానుకోవాలన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సత్యపాల్ గౌడ్, రతన్ గౌడ్,యధా గౌడ్,రాజు గౌడ్, కిష్ట గౌడ్ తదితరులు ఉన్నారు.

## గొప్ప పోరాట యోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ



**బోథ్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** నిజాం నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలు స్వతంత్ర ఉద్యమ పోరాటంతో పాటు తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు.ఆదివారం కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు..ముందుగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేశారన్నారు.దేశ స్వతంత్రం కోసం ఉద్యమంలో పాల్గొన్నారని తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిధ మన్నా రు. అలాగే ధన్నూర్ గ్రామంలో కొండ లక్ష్మణ బాపూజీ వేడుకలను నిర్వహి ంచారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంగయ్య,ఆత్మ చైర్మన్ మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి మాజీ సర్పంచ్ సురేదర్, మెరుగు భోజన్న,చట్ల ఉమేష్,పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వాల్వో డ్రైవర్స్ మినిమం బేసిక్ జీతం 22800 చెల్లించాలి

**భూపాలపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** వాల్వో డ్రైవర్ సమస్య పై విలేక రుల సమావేశం ఏర్పాటు చేసిన కాకతీయ ఓసి 2 వోల్వో ఆపరేటర్స్ యూనియన్ అధ్యక్షులు బడితల మహేందర్ , ఉపాధ్యక్షులు గుమ్మడి రమేష్, ప్రధాన కార్యదర్శి బొద్దుల హరీష్ మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో జీవితం సాగిస్తున్నాం, సమయానికి జీతాలు పడక ఇబ్బందులు పడుతున్నామని ప్రతి నెల పదో తారీకు లోపు జీతాలు వేయాలని , ఇష్టా రీతిలో ఒక్కొక్క ఏరియాలో ఒక విధంగా జీతాలు చెల్లిస్తున్నారని శ్రమ దోపిడి గురి చేస్తున్నారని అన్నారు. ఇతర కంపెనీలలో ఎలా జీతం చెల్లిస్తున్నారో అలా జీతం చెల్లించాలని మినిమం బేసిక్ 22800 చెల్లించాలని ప్రతి సంవత్సరం బోనస్ పర్సంటేజ్ ప్రకారం చెల్లించాలి. భూ నిర్వాసితులకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ స్థానికేతరులకు 20% అవకాశాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాల్వో డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**పరకాల రూరల్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని బాపూజీ విగ్రహానికి నడికుడ మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు గాదే శంకరయ్య పూలమాలవేసి నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాసికంటిరమేష్ మండల నాయకులు ఆకునూరి రమేష్, రాచర్ల శ్రీనివాస్ ,గాదే వెంకటస్వామి, అడ్డుకిచెర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ఏటూరునాగారం,సెప్టెంబర్ 21(జనంసాక్షి).** మండల కేంద్రంలో రజక కులస్తులు అందరు ఏకమై ఆదివారం స్థానిక ఎంపీపిఎస్ పాఠశాలలో సమావేశమై రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పర్వతాల ఎల్లయ్య ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా ముక్కెర లాలయ్య, ఉపాధ్యక్షులుగా కుదురుపాక రాజేశ్, పర్వతాల రమేష్, మడిగల నరేష్, చింతలపల్లి సుమన్, కోశాధారి కారిగా పర్వతాల కుమార స్వామి, సహాయ కార్యదర్శి గా రాజ్ కుమార్, ప్రచార కార్యదర్శులుగా పి రవి, పి విష్ణు, కే సతీష్, పి రాంబాబు లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు గా కుదురుపాక ప్రవీణ్, పర్వతాల బిక్షపతి, ముక్కెర నరేష్, ముక్కెర రఘుపతి, పర్వతాల రాంబాబు, పర్వతాల ఎల్లయ్య, పర్వతాల శ్రీను, పర్వతాల సురేష్, పర్వతాల లాలయ్య, పర్వతాల రమేష్ (పెద్దోడు)వడ్డేపల్లి హరీష్, గౌరవ సలహాదారులుగా చింతలపల్లి వెంకటేశ్వర్లు, పర్వతాల సమ్మయ్య, పర్వతాల పోషాలు, పర్వతాల లాలయ్య, పర్వతాల నర్సింహులు, పర్వతాల అశోక్, పర్వతాల సమ్మయ్య, ముక్కెర లాలయ్య, ముక్కెర నాగభూషనం, పైడాకుల రవి లను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు ఎల్లయ్య మాట్లాడుతూ తనని అధ్యక్షులుగా పదవీ భాద్యతలు ఇచ్చినందుకు రజక కుటుంబ సభ్యుల ందరికి ధన్యవాద ములు తెలిపి సంఘం అభివృద్ధికి పాటు పడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ధనమ్మ, సారమ్మ, నాగమణి, పుష్ప, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు



**చిట్యాల సెప్టెంబర్ 21 (జనంసాక్షి)** అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యేపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో టౌన్ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్య ంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు .బీఆర్ఎస్, బిజెపి పార్టీల నిరసన కార్యక్రమాలను చూస్తే నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని ప్రజలకు అర్థమవుతుందన్నారు. గత ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే, స్వలాభం కోసం పార్టీ మారి నియోజవర్గానికి ఎనలేని అన్యాయం చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణ రావు గెలుపు పొంది, 18 గంటలు అహర్నిశలు కష్టపడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడని తెలిపారు. మా నాయకుడి మీద నీవు మాట్లాడితే సూర్యుని మీద ఉమ్మేస్తే తనపై పడ్డది అన్నట్టు ఉంటదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా చౌకబారు మాటలు మానుకొని అభివృద్ధి కోసం కలిసిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సరిగొమ్ముల సది, గుర్రం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి రైతులు ఐక్యం కావాలి




**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 21(జనం సాక్షి):** రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కా రానికి ఐక్యం కావాలని తెలంగాణ రైతు సంఘం హనుమకొండ కార్యదర్శి ఏం . చుక్కయ్య అన్నారు.ఈ రోజు రమేష్ అధ్యక్షతన పల్లం కన్వెన్షన్ లో సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లాలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు రైతులకు యూరియా సమస్య,కోతుల బెడద ఉందని, భూభారతి పెండింగ్ సమస్యలు, పెండింగ్ రుణమాఫీ సమస్య , ఏసంగే బోనస్ పెండింగ్, పెదరైతుల భూసమస్యలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఆగడాలు తదితర రైతాంగ సమస్యలున్నాయని, వాటిపై భవిష్యత్తులో పోరాడుతామని చుక్కయ్య విస్తృత సమావేశంలో మాట్లాడినారు. ఈ సమావేశంలో గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం (జి ఎం పి ఎస్) జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగన్న, రైతు నాయకులు మడిగే నాగరాజు.కె. నారాయణ రెడ్డి, గుండెకారి మహేందర్ , జి. బాబు రావు. వోరికల గోపాల్, చిన్న మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 21(జనం సాక్షి):** ఎన్నికల హామీలను విస్మరిస్తున్న పాలక పార్టీలకు ప్రజా ఉద్యమాలతోనే గుణపాఠం చెప్పాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఆదివారం ఎంసిపిఐ(యు) చెన్నారావుపేట మండల ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ గోర్మియా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్టీలో చేరుతున్న ప్రజాసంఘాల నాయకులు జన్ను రమేష్, అబ్బదాసి అశోక్, ముర్రి శ్రీనులకు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో సాధించుకున్న రాష్ట్రంలో ప్రజా సమస్యలకు పరిష్కారం లేకపోగా అప్పుల కుప్పగా మారిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అందని ద్రాక్షగా మారాయని గత ప్రభుత్వాల వైఫల్యాలని ఎత్తిచూపుతూ పబ్బం గడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రైతాంగం ఆరుగాలం కష్టించి అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన సరైన సమయంలో ఎరువులు అందించకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు సైతం సహకరించక రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయి ప్రజల అవస్థలు పడుతున్నారని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని గొప్పగా చెప్పి ఆచరణలో కొద్దిమందికే ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఇలాంటి పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఐక్య ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, పార్టీ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్, మండల నాయకులు శ్రీను, మెతుకుపల్లి రాజిరెడ్డి, అచ్చ, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేసిన కొమ్మాలు నాయక్



**గూడూరు,సెప్టెంబర్ 21(జనం సాక్షి).** గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని ముస్లిం వీధిలోని మైనార్టీ నాయకురాలు యాకుబీ మనవడుకి ఇటీవల ప్రమాదవశాత్తు చేయి విరగగా ఆదివారం వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించి,ఆర్థిక సహాయాన్ని అందజేసిన మానుకోట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్. ఈకార్యక్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి,చంటి స్వామి, ఎలమందల శ్రీనివాస్,గ్రామ పార్టీ అధ్యక్షుడు మాన్సింగ్,మండల కాంగ్రెస్ నాయకులు తంగళ్ళపల్లి సునీల్,పేరాల సురేందర్,యూత్ కాంగ్రెస్ నాయకులు షాజహాన్ ,మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 21, (జనంసాక్షి)** పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్ గౌడ్ అన్నారు. ఆదివారం నెన్నెల మండల కేంద్రంలో లబ్ధిదారులకు 7,13,800 రూపాయల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అవసరాలను గుర్తించడంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురునాధం రాజు, దుర్గం గోపి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ



**గూడూరు,సెప్టెంబర్21(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పండుగలో అతి ముఖ్యమైన పండుగ బతుకమ్మ పండుగనీ, బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడపడుచులు ఆపాల గోపాలం తొమ్మిది రోజులు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మను మండలంలోని అన్ని గ్రామాలలో ఆడపడుచులు ఆయా దేవాలయాలలో బొడ్రాయి సమీపంలో ఒక్కేసి పువ్వేసి చందమామ, ఒక్క జాములాయే చందమామ ,అంటూ ఘనంగా జరుపుకున్నారు.మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి దేవాల యం, శివా లయం, సాయిబాబా దేవాలయం ,ఆంజనేయ స్వామి దేవాలయం,బొడ్రాయి, ముత్యాలమ్మ దేవాలయం, ల వద్ద మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో తరలివచ్చి ఘనంగా జరుపుకున్నారు ,పెతారా మాస కావడంతో సాంప్రదాయం ప్రకారం చనిపోయిన మాతృమూర్తులకు బియ్యం ఇచ్చే కార్యక్రమం నిర్వహించారు.

## కొత్తపల్లి చిన్నారి జాహ్నవి బతుకమ్మతో ఆకట్టుకుంది



**భీమదేవరపల్లి సెప్టెంబర్:21(జనం సాక్షి)** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ సందడి మధ్యలో ఒక చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామానికి చెందిన చిన్నారి జాహ్నవి తన చిన్న చేతులతో అలంకరించిన బతుక ్మను మోసుకువచ్చి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది.ఆడపిల్లలే పండుగ శోభ అని చెబుతారు. ఆ మాటలను సాక్షాత్కరించినట్టే జాహ్నవి రూపంసాం ప్రదాయ పట్టు లంగావోణీ,మెడలో హారాలు చేతిలో చంకబేళు ,కాళ్లకు రంగురంగుల బూట్లు వేసుకుని బతుకమ్మను మోసుకువచ్చిన జాహ్నవిని చూసిన ప్రతి ఒక్కరు ఆనందం వ్యక్తం చేశారు.చిన్నారి అమాయకత్వం, ఆరాధన భావం గ్రామ పండుగ వాతావరణానికి మరింత చక్కదనాన్ని తెచ్చాయి.బతుకమ్మ పండుగలో పెద్దలు మాత్రమే కాకుండా పిల్లలు కూడా భాగస్వాములు కావడం పండుగ మహిమను రెట్టింపు చేస్తోంది అని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. జాహ్నవిని పలువురు ఎత్తుకుని ముద్దాడగా మహిళలు యువతులు ఆమెను చూసి మురిసిపోయారు.గ్రామంలో ప్రతి ఒక్కరిని తన అమాయకమైన చిరునవ్వుతో ఆకట్టుకున్న గ్రామజిబతుకమ్మ పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని చెప్పుకోవచ్చు.

## హాస్టల్ వర్కర్స్ బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు

**భూపాలపల్లి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్స్ డైలీ వేజ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని సమ్మె చేస్తున్న,ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నెల సెప్టెంబర్ 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఈరోజు బతుకమ్మ పండుగ కావడంతో టెంటు దగ్గరనే బతుకమ్మ ఆడి డిమాండ్ పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. వారి న్యాయమైన డిమాండ్లకు సీఐటీయూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపినా సిఐటియు జిల్లా అధ్యక్షులు బందు సాయిలు .ఈ కార్యక్రమంలోహాస్టల్, పాఠశాల,వర్కర్స్ నాయకులు ఎండి జావీద్, వెంకటలక్ష్మి, సరూప, సరోజన, స్వామి, భాగ్య,వెంకట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 21 :**మండల కేంద్రంలో పాటు అన్ని గ్రామాల్లో తెలంగాణ ప్రత్యేక పండుగ తెలుగింటి ఆడపడుచులు జరుపుకు నే ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వ హించారు. మహిళలు రంగు రంగుల పూలతో త్రికోణా కారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ,సద్దుల బతుకమ్మ,ఇలా దేని ప్రత్యేకత దాని దే,తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలోఅని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్టసుఖాలు,ప్రేమ,స్నేహం,బంధుత్వ, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు, తదితర ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగఅని మహిళలు దేవాలయాల వద్ద, చెరువుకట్టల వద్ద భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలుఆడి సంబరాలుఘనంగా జరుపుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగేలా గ్రామ పంచా యతీ అధికారులు, పోలీసులు, సంబంధిత అధికారు లు తగు ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ అని,2వ రోజు అటుకుల బతుకమ్మ,3వరోజు ముద్దపప్పుబతుకమ్మ,4వరోజు నానేబియ్యం బతుకమ్మ,5వ రోజు అట్ల బతుకమ్మ,6వరోజు అలిగిన బతుకమ్మ,7వ రోజు వేపకాయల బతుకమ్మ,8వ రోజు వెన్నముద్దల బతుకమ్మ, 9వ రోజు సద్దుల బతుకమ్మ అని తొమ్మిది రోజులపాటు ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకుంటారు.

## కొండా లక్ష్మన్ బాపూజీకి నివాళి



**పాలకుర్తి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి)** తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొండా లక్ష్మన్ బాపూజీ 13 వర్ధంతిని పురస్కరించుకొని రాజీవ్ చౌరస్తాలో ఆదివారం పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సంద ర్భంగా లక్ష్మన్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటి అధ్యక్షుడు మేడారపు సుధాకర్ మాట్లాడుతూ ఆయన జీవితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అంకితమైందని అన్నారు. 1969 లో రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఉద్యమాన్ని ఉదృతం చేసేందుకు తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో కాటబత్తిని రమేష్, చిదిరాల మార్కెండయ్య. పెనుగొండవెంకటేశ్వర్లు. రమేష్, సోమేశ్వర్, నాగయ్య, పుండరీకుడు. కాటబత్తిని సోమేశ్వర్, శ్రీదర్, ఎనగందుల శ్రీనివాస్. తదితరులు ఉన్నారు.

## ఈ డబ్లు ఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలి

### తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపు జై పాల్ రెడ్డి

**ఆత్మకూరు, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):** అక్టోబర్ నెలలో వరంగల్ పట్టణంలో జరిగే అగ్రకుల పేదల సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షులుగోపు జై పాల్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు గ్రామ రెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కేంద్రం లో గ్రామ శాఖ అధ్య క్షులు వంగాల భగవాన్ రెడ్డి అధ్యక్షత జరగగా ముఖ్య అతిథి గా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘ అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి, మాట్లాడుతూ ఓ సి లు అందరూ ఐక్యంగా ఉండాలని, ఓసి ఉద్యమాల ద్వారానే మన హక్కులను కాపాడుకోగలుగుతామని, మన పోరాటాల ఫలితంగా సాధించుకున్న 10% ఈ డబ్లు ఎస్ రిజర్వేషన్లపై జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టాలని, ఈ డబ్లు ఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలనే సమస్యలపై అక్టోబర్ నెలలో రెండవ వారం వరంగల్ పట్టణంలో అగ్రకుల పేదల సదస్సు జరిపి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిద్దామని కావున ఈ సమావేశానికి ఓసి కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి రెడ్డి సంఘం మండల అధ్యక్షులు రేగూరి సంపత్ రెడ్డి నాయకులు బి మల్లా రెడ్డి, ఆర్ సుధాకర్ రెడ్డి,కే విజేందర్ రెడ్డి,జిన్నా భూపాల్ రెడ్డి, రేగూరి జై పాల్ రెడ్డి,జనార్దన్ రెడ్డి, ఎర్ర తిరుపతి రెడ్డి, జై పాల్ రెడ్డి, దొనపాటి మల్లా రెడ్డి, పలకల బుచ్చి రెడ్డి, బి రమణ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, రేగూరి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర అధ్యక్షులు గోపు జై పాల్ రెడ్డి సన్మానించారు.



## సింగరేణిలో సాంస్కృతిక ప్రతిభ ప్రదర్శన

**భూపాలపల్లి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**భూపాలపల్లి ఏరియా సింగరేణి స్టేడియం సి. ఇ ఆర్. క్లబ్ లో నిర్వహించిన కల్చర్ మీట్ కార్యక్రమములో సంస్థ కళాకారులు, ఉద్యోగులు, పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజిక్, డాన్స్ వైవిధ్యమైన కార్యక్రమాలు వినోదాన్నీ, సాంస్కతిక ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ...సింగరేణి సంస్థ కళాకారులు, , ఉద్యోగుల మధ్య ఐక్యత సమాజ సంస్కృతి పట్ల సంకల్పాన్ని. తెలియజేయడం అభినదనీయం అని అన్నారు. ఈ కల్చర్ మీట్ సింగరేణి సంస్థలో ఉద్యోగాలందరి సామాజిక, సాంస్కృతిక స్వభావాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక పెద్ద మైలురాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ సభ్యుడు సఖ్యతా భావంతో, సంతోషంగా సంస్కృతి పరిరక్షణకు సమకూర్చిన శ్రద్ధను ప్రదర్శించారన్నారు. కోల్ ఇండియా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి, సింగరేణి సంస్థను మొదటి స్థానంలో నిలబెట్టి బహుమతులను సాధించాలన్నారు. సింగరేణి మేనేజ్మెంట్ తరపున కార్యక్రమాలను అభినందిస్తూ, ఇలాంటి సామాజిక సాంస్కృతిక ప్రదర్శనలను తరచుగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పాక దేవయ్య, కల్చరల్ కోఆర్డినేటర్, అడిచర్ల శ్రీనివాస్, మెడ మల్లేష్ ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా నంది అవార్డు గ్రహీత ఆచార్యులు కుంట రాజు పాల్గొన్నారు.



## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పుచ్చకాయల నరసయ్య వర్ధంతి



**సెప్టెంబర్ 21(శ్రీరాంపూర్(జనంసాక్షి):** సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పుచ్చకాయల నరసయ్య 31వ వర్ధంతిని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య,బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా లు పాల్గొనగా యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హృదయాల్లో నరసయ్య చిరస్మరణీయుడని,నిత్యం కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడని,190 మాస్టారు నిండని బదిలీ పిల్లర్ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి డిపెండెంట్ ఉద్యోగం ఇవ్వాలని సమ్మె చేసి చివరకు హైకోర్టులో కేసు వేసి బదిలీ కోల్ పిల్లర్ కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగం హక్కు కల్పించింది నరసయ్య అని తెలిపారు.ఉమ్మడి తాళ్లపెల్లి మేజర్ గ్రామపంచాయతీకి భారత కమ్యూనిస్టు పార్టీ నుండి సర్పంచిగా ఎన్నికై కార్మికులకు నివాసం ఉండేలా ఆర్కే సిక్స్,అరుణక్క నగర్ తదితర ప్రాంతాలలో గుడిసెలు వేయించి వారికి కరెంటు,మంచినీరు తదితర మౌళిక సౌకర్యాలను సింగరేణి యాజమాన్యంతో ఒప్పించి ఇప్పించారన్నారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు,సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య,సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య,జిఎం కమిటీ సభ్యులు నాగభూషణం,బద్రి బుచ్చయ్య,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్,ఫిట్ కార్యదర్శులు మురళీ చౌదరి, సదానందం,గునిగంటి నర్సింగ్ రావు,ఆకుల లక్ష్మణ్, సంఘం సదానందం తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఆట స్థలాన్ని పరిశీలించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**పర్వతగిరి సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**
పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామంలో బతుకమ్మ ఆట స్థలాన్ని పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేయాలని పంచాయతీ అధికారులు గ్రామ పార్టీ అధ్యక్షులు,ముఖ్య నాయకులను కొరిన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని పర్వతగిరి మండల ప్రజానికానికి ఎంగిలిపు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గడ్డం జనార్ధన్ సినీయర్ నాయకులు లింగంపల్లి కుమార్ రావు గోపాల్ రావు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ యువజన కాంగ్రెస్ నాయకులు కొమ్ము రమేష్,మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మూడు దేవరాజ్ బూత్ కన్వీనర్లు భూక్య అనిల్ గడ్డం కుమార్ హరీష్ సదయ్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే జీఎస్సార్

**శాయంపేట, సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**శాయంపేట మండల కేంద్రంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 49 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు రూ. 15,58,000/- విలువైన చెక్కులను అందజేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు, ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.చెక్కుల పంపిణీ అనంతరం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు . మండల కేంద్రానికి చెందిన మారపెల్లి ప్రమీల గుడెప్పాడ్ క్రాస్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆదివారం జరిగిన దశ దినకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రమీల చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, బాసాని చంద్రప్రకాష్, చల్ల చక్రపాణి, మారేపల్లి బుజ్జన్న, కృష్ణమూర్తి, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులపై కమిటీ ఏర్పాటు చేయాలి
- సీమ శ్రీనివాస్ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రఅధ్యక్షులు




**ఆత్మకూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ బస్సు యాత్ర ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారి స్థితిగతులపై రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఉద్యమకారులకు ఇంటి స్థలం ఉచిత బస్సు సౌకర్యం రైలు సౌకర్యం కల్పిస్తూ స్థానిక సంస్థ ఎన్నికలు కూడా ఉద్యమకారులకు అవకాశం కల్పించాలని సరియైన స్థానం కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల ఆదుకొని ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలలో ఉద్యమకారులకు 25% కేటాయించి ఉద్యమకారులు ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పొడి శెట్టిగణేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఈర్సండ్ల సదానందం, ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎండి బాబు మియా (చిరు )సీనియర్ నాయకులు రాయరాకుల రవీందర్, సీనియర్ నాయకులు మార్క రజనీకర్ గౌడ్, పసుల లక్ష్మీనారాయణ, దామెర కుమారస్వామి, ఆత్మకూర్, దామెర రెండు మండలాల ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని బస్సు యాత్ర విజయవంతం చేశారు.

## తాటికొండలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని తాటికొండ గ్రామంలోని శివాలయంలో తెలంగాణ ప్రత్యేక పండుగ తెలుగింటి ఆడపడుచులు జరుపుకునే ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఆది వారం రోజున ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగు రంగుల పూలతో త్రికోణా కారంలో పేర్చి అలంక రించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లతో వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ,సద్దుల బతుకమ్మ,ఇలా దేని ప్రత్యేకత దాని దే,తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగఅని మహిళలు దేవాలయాల వద్ద, చెరువు కట్టల వద్ద భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలుఆడి సంబరాలు ఘనంగా జరుపు కున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగేలా గ్రామ పంచా యతీ అధికారులు, పోలీసులు, విద్యుత్ అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకుంటారు.

## ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ

- ఉత్సాహంగా పాల్గొన్న యువతులు, మహిళలు

**మరిపెడ సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆదివారం సాయంత్రం 'ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు' ఘనంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు వేడుకల్లో భాగంగా తంగేడు, గునుగు, బంతి, పట్నం బంతి, రక రకాల పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. మరిపెడ మండలం లో గ్రామ గ్రామాన అంగారాన్ని అంటిన బతుకమ్మ పండుగ తొలి రోజు సంబరాలు మరిపెడ కేంద్రంలోని శ్రీ సీతారామ ఆంజనేయ ఆలయంలో పలు కాలనీల్లో మహిళలు ఒకచోట చేరి 'ఒక్కేసి పువ్వేసి సందమామ ఒక్క జాములో సందమామ అని అంటూ బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. బతుకమ్మ వేడుకల్లో జనగామ అర్బన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయ ఆలయ కమిటీ మున్సిపాలిటీ హెల్త్ ఇన్స్పెక్టర్ షేక్ పాషా మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

- గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ప్రారంభం



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 21(జనంసాక్షి):** గ్రామాల్లో తొమ్మిది రోజులపాటు అత్యంత వైభోపేతంగా నిర్వహించే బతుకమ్మ సంబరాలు మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం గ్రామాలలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతులు ఉదయాన్నే లేచి తీరొక్క పూలను సేకరించి అందమైన బతుకమ్మలను పేర్చి సాయంత్రం వేళలో సమీపంలోని పోచమ్మ, హనుమాన్, శివాలయాల వద్దకు వెళ్లి బతుకమ్మ పాటలను పాడుతూ ఆటలు ఆడారు. దీంతో గ్రామాల్లో ఎటు చూసినా ఎంగిలిపూల బతుకమ్మ సందడి వాతావరణం కనిపించింది.

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

**గూడూరు,సెప్టెంబర్21(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పండుగలో అతి ముఖ్యమైన పండుగ బతుకమ్మ పండుగ నీ బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడపడుచులు ఆపాల గోపాలం తొమ్మిది రోజులు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు.ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మను మండలంలోని అన్ని గ్రామాలలో వెంగంపేటలో ఆడపడుచులు ఆయా దేవాలయాలలో బొడ్రాయి సమీపంలో ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయే చందమామ అంటూ ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో లక్ష్మీనారాయణస్వామి దేవాలయం, శివాల యం, సాయిబాబా దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం, ముత్యాలమ్మ,ల వద్ద మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో తరలివచ్చి ఘనంగా బతుకమ్మ పాటలతో జరుపుకున్నారు.వెంగంపేటలో గ్రామంలో మహిళలు బతుకమ్మలతో పెద్ద ఎత్తున బతుకమ్మలతో తరలి వచ్చినారు. పెతారమాస కావడంతో సాంప్రదాయం ప్రకారం చనిపో యిన మాతృమూర్తులకు బియ్యం కార్యక్రమం నిర్వహించారు.



## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభం

**భూపాలపల్లి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ పండుగ వేడుకలు ప్రారంభం భూపాలపల్లి పట్టణంలో మిలీనియం క్వాటర్స్ సుభాస్ కాలనీ నందు లక్ష్మీ గణపతి కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ పండుగ వేడుకల్లో మొదటిరోజు మహిళలు చిన్నపిల్లలు అధిక సంఖ్యలో అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మను తంగేడు ,గునుగు,బంతి పువ్వు ప్రధానంగా ఉపయోగించి పేర్చి అత్యంత భక్తిశ్రద్ధలతో తెలంగాణలో పువ్వులను దేవతలుగా కొలుస్తూ సాంస్కృతి సాంప్రదాయం అనాదికాలం నుండి సాగుతున్న సాంప్రదాయం మహిళలందరూ ఒక దగ్గర చేరి మధ్యలో బ్రతకమ్మను ఉంచి పాటలు పాడుతూ నుత్యాలు చేస్తూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ప్రారంభమై ఈ బతుకమ్మ తొమ్మిది రోజులు ఒక్కొక్క రోజు ఒక విధంగా పేర్చి పూజిస్తారు.

## కోలాహలంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం



**నడికూడ, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధ్యంగా కొలుస్తూ నిర్వహించే ఆడపడుచుల వేడుక బతుకమ్మ సంబరాలు మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన వాడవాడల మొదలయ్యాయి. మహాలయ అమావాస్య ఆదివారం రోజున ఎంగిలిపూల బతుకమ్మతో ఆడపడుచుల ఆటపాటలతో వేడుకలా జరుపుకున్నారు. తీరొక్క పూలతో చిన్న, పెద్ద అందరూ ఒకచోట కలిసి ఆటపాటలతో సందడి చేశారు.

## ఘనంగా 49వ ఆవిర్భావ దినోత్సవం

- అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి : సురేష్ గుగ్గిళ్ళ



**మంగపేట సెప్టెంబర్ 21(జనంసాక్షి):** అంబేద్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆ సంఘం మండలశాఖ అధ్యక్షుడు గుగ్గిళ్ళ సురేష్ జెండా ఆవిష్కరణ చేశారు. ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం ఏర్పడి 49 సంవత్సరాలలో అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి దీకొండ కాంతారావు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరివాడని సమాజంలోని బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జానపట్ల జయరాజు, లింగంపెల్లి శ్రీనివాసరావు, ఆదివాసీ సంఘాల నాయకులు పొదెం రవీందర్, జబ్బ రవి, వాసం సారంగపాణి,మడి మల్లయ్య, గాదె శ్రీనివాసచారి, పూసల నర్సింహారావు, హైదర్ బుట్టో తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు

**పెద్దవంగర సెప్టెంబర్ 21(జనంసాక్షి):** మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు తెలంగాణలో ఊరు వాడ ముస్తాబై తొమ్మిది రోజులపాటు సాగే బతుకమ్మ పండుగలో ఒక్కొ రోజు ఒక్కొ ప్రత్యేకత.ఈ పూల పండుగ లో ప్రతిరోజు ప్రత్యేక ఫలహారాలు నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది మొదటి రోజైనా ఎంగిలి పూల బతుకమ్మను తీరక పూలతో పేర్చి ఆడపరచులంతా ఒకచోట చేరి చేసుకోని బతుకమ్మ ఆటపాటలతో సంబరాలు చేసుకుంటున్నారు.



# పండుగకి ఊరికెళ్తున్నారా! జర ఇల్లు భద్రం

- **మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి**

**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 21(జనం సాక్షి):** పండుగకి ఊరికెళ్తున్నారా జర ఇల్లు భద్రం అంటూ మహబూబాబాద్ పట్టణ ప్రజలను ఉద్దేశించి టౌన్ ఇన్స్పెక్టర్ మహేంఠ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లల్లో చోరీలను నియంత్రణ చేసేందుకు పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందనీ, అలాగే చోరీల కట్టడికై ప్రజలు ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలే తప్ప,పక్కింటి వారికి తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దు అన్నారు. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిదనీ, నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్, సెక్యూరిటీ గార్డ్, సర్వెంట్ గా నియమించుకోవాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండని, మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలనీ, ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్ లో మీ ఇంటిని, పరిసరాలను ప్రత్యేక్షంగా చూసుకొవచ్చునీ, సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఊరు వెళు న్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కట్టెన్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలన్నారు. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చుమని చెప్పాలి.ఇంటి ముందు చెత్త చెదారం,న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నదన్నారు. మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేయాలన్నారు. ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అని తెలిపారు.




# భూసంస్కరణల చరిత్రలో అధ్యాయంగా నిలిచిన చాకలి ఐలమ్మ

చాకలి ఐలమ్మ నాటకం గాఢమైన అభినందనలతో ముగిసింది. చరిత్రలో సమూలంగా మారిపోయిన ఓ మహిళా యోధురాలి గాథను, నేటి ప్రేక్షకులకు సజీవంగా, ఉదాత్తంగా అందించగలిగిన నాట్య ప్రదర్శన. ఈ నాటకంలో ఐలమ్మ వ్యతిరేకత, వ్యథ, పోరాటస్ఫూర్తి అన్నీ శక్తివంతంగా ఆవిష్కరించబడ్డాయి.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ భూసంస్కరణ చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితాన్ని ఆధునిక రంగస్థలంపై నాట్యరూపంలో తీసుకురావడం ఆచార్య ఆలేఖ్య పుంజాల బృందం గొప్ప నాటకసాహసమే అని చెప్పాలి.నాటకం ద్వారా చాకలి వర్గానికి చెందిన ఒక సాధారణ మహిళ పల్లె పాలకుల అక్రమాలకు, జమీందారి వ్యహారాలకు, శోషణకు వ్యతిరేకంగా ఎలా నిలదీసిందో ప్రబలంగా ప్రదర్శించారు. నాటకం ముగిసిన వెంటనే చప్పట్లు హర్షధ్వనులతో ప్రేక్షకులు స్పందించారు.నేటి తరం యువతకు చాకలి ఐలమ్మ వంటి విప్లవ మహిళల గురించి తెలియజేసే ప్రయత్నానికి విశేష ప్రశంసలు లభించాయి.అనంతరం ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ఆలేఖ్య బృంద సభ్యులకు శాలువలతో సత్కరించారు.

# ఒక్కేసి పువ్వేసి చందమామ

బతుకమ్మలతో వచ్చిన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా శాఖల సిబ్బంది ఏర్పాట్లు చేయడంతో పాటు పోలీసులు భద్రతా ఏర్పాట్లను చేశారు కొన్ని స్వచ్ఛంద సంస్థలు మహిళలకు తాగునీరు మజ్జిగ మొదలైన పానీయాలను అందించారు.

# రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చు

పెంపొంది ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సికిల్ సెల్ తల సేమియా బాధితులకు రక్తం అవసరం ఎప్పటికీ ఉంటుందని, యువత రక్తదాన శిబిరాలలో స్వచ్ఛందంగా పాల్గొని ప్రజల ప్రాణ రక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. పోలీస్, ఇతర శాఖల వారీగా స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో రక్తదాన శిబిరాలు నిర్వహించి యూనిట్లను సేకరించి ప్రజల ప్రాణ రక్షణలో వినియోగించడం జరుగుతుందని తెలిపారు. మెగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డైలీవేజ్ వర్కర్ల సమ్మె కు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మద్దతు



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 21(జనంసాక్షి) :** గిరిజన ఆశ్రమం పాఠశాలలు హాస్టల్ వర్కర్ల నిరవధిక సమ్మె 10వ రోజు సమ్మె శిబిరం వద్ద బతుకమ్మలాడి నిరసన తెలియజేశారు. పదవరోజు సమ్మెకు సంఘీభావంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కర్నె లాజర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ, కార్మికులకు వేతనాలు పెంచుతామంటూ అధికారంలోకి వచ్చి ఆచరణలో జీతాలు పెంచకుండా జీతాలు తగ్గిస్తూ కొత్తగా జీవో నెంబర్ 64 ను అమలు చేస్తానంటే వర్కర్లను మోసం చేయడమేనని అన్నారు.

# భూపాలపల్లిని దోచుక తిన్న గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు

- **మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్**

**టేకుమట్ల సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రకృతి సంపదను ప్రజా సంపదను అందిన కాడికి దోచుకు తిని వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్న దొంగలు గండ్ర వెంకటరమణారెడ్డి జ్యోతి దంపతులని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ అన్నారు. టేకుమట్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ఇసుక వనరులు ఇందిరమ్మ ఇండ్ల కట్టుకుంటున్న నిరుపేదలకు చౌకగా అందాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఇసుక పాలసీ పై ప్రత్యేక దృష్టి సారించి అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి షరతులు లేకుండా ఇసుకను అందిస్తున్న విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ ఎద్దేవా చేశారు. వెంకటరమణారెడ్డి దంపతులు గత దశాబ్ద కాలంగా టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి వాగులలోని ఇసుకను ఇష్ట రీతిన బిల్డర్లకు అమ్ముకొని వేల కోట్లు కూడా పెట్టుకుని నేడు ఇసుక దోపిడికి గురవుతుందంటూ, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి అంటు రైతులపై లేని ప్రేమను చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. మీ అక్రమాలు దోపిడీలను చూసే నియోజకవర్గ ప్రజలు నీకు ఓటు వేయకుండా చిత్తుగా ఓడించిన సంగతి మర్చిపోవద్దని సూచించారు. మండలానికి ఒక ధర చొప్పున ఫిక్స్ చేసి ఎలాంటి షరతులు లేకుండా ఇసుక తరలించుకోవచ్చని సత్యనారాయణరావు అధికారులతో సమీక్షించి ఇసుకను నిరుపేదలకు అందిస్తున్న క్రమంలో, కొంతమంది దళారులు ఇదే అదునుగా భావించి ఇసుకను ఇతర ప్రాంతాలకు అధిక ధరలకు అమ్ముకుంటున్నారన్నారు.

# కాంగ్రెస్ బీఆర్ఎస్ ఇద్దరూ తోడు దొంగలే

- **బిజెపి మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు**

**టేకుమట్ల సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** టేకుమట్ల మండలంలో గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు మీరంటే మీరు ఇసుక దొంగలని ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పగటి వేషగాళ్ల లాగా ప్రజలను తప్పుదోవ పట్టించడాన్ని అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్ హాజరై మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బీఆర్ఎస్ పార్టీ గండ్ర వెంకట రమణారెడ్డి అనుచరులు ఇసుక దందా చేస్తున్నారని వెలిశాల గుట్టలు అక్రమంగా ఆక్రమించుకున్నారని నేను ఎమ్మెల్యేగా గెలిస్తే ఇసుక అక్రమ దందా చేస్తున్న అతని అనుచరులను వెలిశాల గుట్టలను అక్రమంగా ఆక్రమించుకున్న రమణారెడ్డిని అరెస్టు చేయిస్తానని అనేక ఆరోపణలు చేసి ఇప్పుడు అధికారంలో ఎమ్మెల్యేగా ఉండి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా తాను కూడా కాంగ్రెస్ పార్టీ లీడర్లను పెట్టుకుని ఇసుక దోపిడి కొనసాగిస్తున్నట్టుగా, దోపిడీకి సహకరిస్తున్నట్టుగా కనపడుతుందన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ నువ్వంటే నువ్వు దొంగ అని అనుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు, నిజానికి వాళ్ళిద్దరూ ఇసుక దొంగలేనని ప్రజలు గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు టేకుమట్ల మండలంతో పాటు రాష్ట్రమంతటా ఆ పార్టీ నాయకులు అక్రమ ఇసుక రవాణాతో వేల కోట్ల ప్రజా ధనం దోచుకున్నారని, నేరెళ్లలో అడ్డుపడిన దళిత కుటుంబాలను రోజుల తరబడి చిత్ర హింసలు పెట్టిన నీచపు చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



**శాయంపేట, సెప్టెంబర్ 21 (జనం సాక్షి) :** శాయంపేట మండల కేంద్రంలోఆదివారం రోజున కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘననివాళులు అర్పించినారు. అనంతరం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం శాయంపేట మండల అధ్యక్షుడువంగర సాంబయ్య మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితకాలమంతా కుల, వర్గ ,ప్రాంతీయ ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరిపారని అన్నారు.తెలంగాణలో పాతుకుపోయిన జాగిర్ధార్, సంస్థానాధీశులు, వతందార్ ,దేశ్ముఖ, ముక్తేదార్, ఇనందార్, రెడ్డి, వెలమ దొరల నిరంకుశ వెట్టి చాకిరి విముక్తి కొరకు పోరాడుతూనే ప్రజలను సంఘటిత పరుచుతూ దేశ స్వాతంత్రం కొరకు ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. తొలి దశ ,మలిదశ తెలంగాణ ఉద్యమంలో తుది శ్వాస విడిచే వరకు పోరాడిన వీరుడు దీరుడు అని అన్నారు.1950లో చేనేత పారిశ్రామిక సహకార సంఘాలను స్థాపించి లక్షల మందికి ఉపాధి కల్పించిన యోధుడని ,హైదరాబాదులో పద్మశాలీల హాస్టల్ స్థాపించి బీసీ కులాల హాస్టల్ స్థాపన కొరకు ప్రభుత్వాలతో పోరాడి సాధించిన గొప్ప వ్యక్తి మహోన్నతుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి, శాయంపేట గ్రామ అధ్యక్షుడు బాసని ప్రకాష్ , పత్తి శ్రీనివాస్, చిందంరవి, దిడ్డిప్రభాకర్, రంగు మహేందర్, బాసని నవీన్, కోమటి శేఖర్ ,మామిడి మారుతి, తుమ్మ ప్రభాకర్ ,బడుగు సత్యం, బాసాని చంద్రమౌళి, చల్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# 28న లంబాడీల ర్యాలీని విజయవంతం చేయండి

**లంబాడీల జేపీసీ జిల్లా కో -కన్వీనర్ అంగోత్ ధర్మ నాయక్**



**గుడూరు (జనంసాక్షి)** : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్లం 28న జరిగే లంబాడీల శాంతి యూత ర్యాలీని విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా లంబాడి జేపీసీ కో కన్వీనర్ ఆంగోత్ ధర్మానాయక్, భూక్య సురేష్ నాయక్,బానోతు రామన్న నాయక్, ఉద్యోగ జేఏసీ నేతలు భూక్య బాలు నాయక్, వాంకుడోత్ గోపీనాథ్ నాయక్,పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం రాజ్యాంగబద్ధంగా గిరిజనులుగా కొనసాగుతున్నామని, లంబాడీలకు ప్రత్యేక వేషం భాష ఉందని,అవసరాల రీత్యా పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న కూడా,మా భాషలో మాట్లాడుతున్నామని వారు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 28వ తేదీన జరిగే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని వారు లంబాడి ప్రజలను కోరారు. తండాలలో ఉన్న ప్రజలు,విద్యావంతులు, విద్యార్థులు,ఉద్యోగస్తులు,వారి కర్తవ్యంగా ర్యాలీకి రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎల్ జేఏసీ నాయకులు వీరన్న నాయక్, మంగీలాల్ నాయక్,కిషన్ నాయక్,రవి నాయక్,చంటి నాయక్, కటార్ సింగ్ నాయక్,శ్రీనివాస్ నాయక్, రామచందర్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు రాజేష్**



**చిట్యాల సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కాకతీయ యూనివర్సిటీ రజిక విద్యార్థి సంఘం ఇంచార్జ్, బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు కోరపల్లి రాజేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం దసరా పండుగను పురస్కరించుకొని గ్రామంలో నిర్వహిస్తున్న సీసీపీఎల్ 2 క్రీడా నిర్వాహకులకు ఐదువేల నగదును అందజేశారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. దేశ భవిష్యత్తుకు కేంద్ర బిందువు యువత అని, యువత తలుచుకుంటే దేనినైనా సాధించవచ్చు అన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం పెరుగుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ క్రాంతి కుమార్ రెడ్డి, అశోక్ రెడ్డి, మార్క నగేష్, క్రికెట్ టోర్నమెంట్ అధ్యక్షులు ఇంచర్ల రాకేష్, కొత్త శ్రీ కాంత్ ,వేణు, గొల్లపల్లి రాజు ,చల్ల శ్రీనివాసరెడ్డి, దామెర రాజు, గుండెపు రెడ్డి రాజు, సంపత్, దేవేందర్, సంపత్, సురేష్ పాల్గొన్నారు.